హెలికాప్టర్ ద్వారా గడ్చిరోలికి వెళ్లిన పోలీస్ అధికారులు

గడ్చిరోలిలో పోలీసుల ప్రత్యేక సమావేశం

- పాల్గొన్న మూడు రాష్ట్రాల సరిహద్దు జిల్లాల అధికారులు
- పార్లమెంట్ ఎన్నికల నిర్వహణపై చర్చ

భూపాలపల్లి రూరల్, మార్చి 24 : మహా రాష్ట్ర, తెలంగాణ, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల సరిహద్దు జిల్లాల పోలీసు అధికారులతో మహా రాష్ట్రలోని గడ్చిరోలి ఎస్పీ క్యాంపు కార్యాలయంలో ఇన్స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ అంకిత్ గోయల్, ఐజీ ఎం శ్రీనివాస్ ఆధ్వర్యంలో శనివారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. పార్లమెంట్ ఎన్నికల దృష్ట్యా మావోయిస్టుల కదలికలు, సరిహద్దు ప్రాంతాల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా తీసుకోవాల్సిన ముందస్తు చర్యలపై చర్చించారు. ఈ సమావేశానికి భూపాలపల్లి ఎస్పీ కిరణ్ ఖరే, రామగుండం పోలీస్ కమిషనర్, ఆసిఫాబాద్ ఎస్పీ, మంచిర్యాల డీసీపీ రామగుండం నుంచి హెలికాప్టర్‌లో గడ్చిరోలికి వెళ్లారు. ఈ సందర్భంగా పోలీస్ అధికారులు మాట్లాడుతూ మూడు రాష్ట్రాల సరిహద్దు జిల్లాల అధికారులు సమన్వయంతో పనిచేసి ఎన్నికలు సజావుగా సాగేలా చూడాలన్నారు. సరిహద్దు ప్రాంతాల్లో చెక్ పోస్టులు ఏర్పాటు చేసి పకడ్బందీగా తనిఖీలు నిర్వహించాలని సూచించారు. సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక దృష్టి సారించాలని, నేరాల కట్టడి, కేసుల విషయంలో ఒకరికొకరు సహకరించుకోవాలన్నారు. సమావేశంలో మూడు రాష్ట్రాల సరిహద్దు జిల్లాల పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

గీత కార్మికుడికి గాయాలు

టేకుమట్ల, మార్చి 24 : ప్రమాదవశాత్తు తాటి చెట్టు పైనుంచి పడి మండల కేంద్రానికి చెందిన గీత కార్మికుడు ఏరుకొండ రామస్వామికి తీవ్రగాయాలయ్యాయి. గమనించిన తోటి కార్మికులు చికిత్స కోసం హనుమకొండలోని ఆస్పత్రికి తరలించారు.

బస్టాండులో వృద్ధురాలు మృతి

ఏటూరునాగారం, మార్చి 24 : మండల కేంద్రంలోని బస్టాండులో ఓ వృద్ధురాలు ఆకస్మాత్తుగా మృతి చెందిన ఘటన ఆదివారం చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. కన్నాయిగూడెం మండలం సింగారం గ్రామానికి చెందిన పోశెట్టి లక్ష్మీనర్సమ్మ (65) మండల కేంద్రంలోని వైద్యశాలలో చికిత్స నిమిత్తం కుమారుడు శ్రీనివాస్‌తో కలిసి వచ్చింది. ఈ క్రమంలో మూత్ర విసర్జన కోసం వెళ్లిన లక్ష్మీనర్సమ్మ కింద పడి స్పృహ కోల్పోవడంతో అక్కడున్న ప్రయాణికులు ఆమెను బస్టాండు గద్దెపైకి చేర్చారు. కొద్ది సేపటికి అక్కడే ప్రాణాలు విడిచింది. అనారోగ్యంగా ఉన్న లక్ష్మీనర్సమ్మ వడదెబ్బకు గురై మృతిచెంది ఉంటుందని భావిస్తున్నారు. కాగా, మృత దేహాన్ని కుమారుడు శ్రీనివాస్ తన స్వగ్రామానికి తీసుకెళ్లారు.

ప్రకృతి వనాలపై పట్టింపేది?

- అధికారుల పర్యవేక్షణ కరువు
- ఎండిపోతున్న మొక్కలు

ప్రకృతి వనంలో ఎండిన మొక్కలు

మహదేవపూర్, మార్చి 24 : ప్రజలకు ఆహ్లాదాన్ని పంచేందుకు ఏర్పాటు చేసిన పల్లె ప్రకృతి, బృహత్ పల్లె ప్రకృతి వనాలు అధికారుల పర్యవేక్షణ లేక వెల వెలబోతున్నాయి. నాడు పచ్చదనంతో కళకళలాడిన వనాలు నేడు ఎండిన మొక్కలు, పొదలతో కళావిహీనంగా కనిపిస్తున్నాయి. మండలంలో మొత్తం 25 పల్లె ప్రకృతి వనాలు, నాలుగు బృహత్ పల్లె ప్రకృతి వనాలను కేసీఆర్ సర్కారు ఏర్పాటు చేసింది. వాటిలో లక్షలాది రూపాయలు వెచ్చించి రకరకాల (పూలు, పండ్లు, ఔషధ, నీడనిచ్చే) మొక్కలను నాటారు. దీంతోపాటు వాకింగ్ ట్రాక్, వనాల చుట్టూ ఫెన్సింగ్, ఆర్చి, చిన్నారుల కోసం క్రీడా పరికరాలను సమకూర్చారు. గతంలో ఆహ్లాదాన్ని పంచిన ప్రకృతి వనాలను ప్రస్తుతం అధికారులు పట్టించుకోక ఎండిపోతుండడంతో ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు మండల కేంద్రంలోని బృహత్ పల్లె ప్రకృతి వనం పర్యవేక్షణ కరువై, సకాలంలో నీరందించక, కలుపు మొక్కలు తొలగించకపోవడంతో అధ్వాన్నంగా మారింది. అధికారుల నిర్లక్ష్యంతో ప్రకృతి వనాల్లో పశువులు తిరుగుతున్నాయని, రాత్రి వేళల్లో అసాంఘిక కార్యకలాపాలు కొనసాగుతున్నాయని పలువురు ఆరోపిస్తున్నారు. ఈ విషయమై ఎంపీడీవో ప్రసాద్‌ను వివరణ కోరగా మండలంలోని పీపీవీ, బీపీపీవీలపై నిరంతర పర్యవేక్షణ ఉంటుందన్నారు. మొక్కలకు సకాలంలో నీరందించాలని, కలుపు మొక్కలను ఎప్పటికప్పుడు తొలగించాలని సిబ్బందిని ఆదేశించామన్నారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామన్నారు.

ఇంటి నుంచి వెళ్లగొట్టిన రెవెన్యూ అధికారులు

అవమానంతో ఒకరి ఆత్మహత్యాయత్నం

ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సతీశ్

టేకుమట్ల, మార్చి24: తన కుటుంబాన్ని కట్టుబట్టలతో బయటికి పంపి తన ఇంటికి రెవెన్యూ అధికారులు తాళం వేయడంతో అవమానం భరించలేక ఒకరు పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన మండలంలోని రామకృష్ణాపూర్(వీ) గ్రామంలో ఆదివారం చోటుచేసుకుంది. బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. రామకృష్ణాపూర్(వీ) గ్రామానికి కేసీఆర్ సర్కారు మొదటి దశలో 50 డబుల్ బెడ్రూం ఇండ్లను మంజూరు చేసింది. ఆ తర్వాత మరో 10 మంజూరు చేయగా, సెకండ్ లిస్ట్‌లో చెక్క ప్రేమలత (ఆమె భర్త సతీశ్) పేరు వచ్చింది. అయితే మొదటి లిస్ట్‌లో పేరు వచ్చిన ఈర్ల కొమురమ్మ ఆ ఇండ్లను ఎస్సీ కాలనీలో కడుతున్నారని, తనకు డబుల్ బెడ్రూం అవసరం లేదని కమిటీ సభ్యులకు చెప్పడంతో గ్రామ పంచాయతీ తీర్మానం మేరకు ప్రేమలతకు దానిని కేటాయించారు. దీంతో ప్రేమలత భర్త సతీశ్ రూ. 5 లక్షలు అప్పు తెచ్చి తనకు నచ్చినట్టు ఇంటిని నిర్మించుకుని భార్య, పిల్లలతో ఉంటున్నాడు. అయితే మొదటి లిస్ట్‌లోకి తన పేరును మార్చుకోకపోవడంతో ఇంటి నిర్మాణం పూర్తయిన తర్వాత అది తన పేరు మీదనే ఉందని, తనకే కావాలని కొమురమ్మ అధికారులను కలవడంతో వారు ఇంటికి తాళం వేశారు. దీంతో అప్పటి ఎమ్మెల్యే రమణారెడ్డికి విషయం చెప్పి తన పేరు మీదకు ఇంటిని మార్చాలని వినతి పత్రం ఇచ్చారు. దీంతో ఆయన తహసీల్దార్‌ని విచారణ చేయమని ఆదేశించారు. కొమురమ్మను విచారణకు రమ్మంటే రాకపోవడంతో, సభ్యులు చెప్పిన ప్రకారమే ఇల్లు కట్టించుకున్నాడని తేలడంతో సతీష్ ఆ ఇంట్లోనే ఉంటున్నాడు. అయితే ఆన్‌లైన్‌లో పేరు మారకపోవడం, ప్రభుత్వం మారడంతో ఇప్పుడు మళ్లీ తన పేరిట ఉన్న ఇల్లు తనకు కావాలని కొమురమ్మ ఆర్డీవోని కోరడంతో ఆయన ఆదేశాల మేరకు శనివారం రెవెన్యూ అధికారులు ఇంటికి తాళం వేశారు. దీంతో తీవ్ర మనోవేదనకు గురైన సతీశ్ ఆదివారం తెల్లవారుజామున 3 గంటలకు ఇంటి తాళం పగులకొట్టి లోనికి వెళ్లి తన చావుకు ఈర్ల కొమురమ్మ, ఆమె భర్త భిక్షపతి, రాజు, రాధ కారణమంటూ సూసైడ్ లెటర్ రాసి పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు చిట్యాల ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. విచారణ జరుపుతున్నట్లు ఎస్సై ప్రసాద్ తెలిపారు.

మెపా ఆధ్వర్యంలో ఆర్థిక సాయం

భూపాలపల్లి రూరల్, మార్చి 24 : ఇటీవల మృతి చెందిన భూపాలపల్లి మండలం పంబాపూర్‌కు చెందిన కటికర్ల జంపయ్య కుటుంబాన్ని ఆదివారం మెపా రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కొత్తగట్టు శ్రీనివాస్ పరామర్శించి రూ. 40 వేల ఆర్థిక సాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్య, ఉద్యోగం, సాధికారత లక్ష్యంగా తమ యూనియన్ ముందుకెళ్తున్నదని, ముదిరాజ్ బంధువులకు ఆపద వస్తే మెపా రాష్ట్ర కమిటీ తరపున ఆదుకోవడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. ఆయన వెంట రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రేగుల మొగిలి, జిల్లా అధ్యక్షుడు పుట్ట తిరుపతి, కౌటం రమేశ్, బాబురావు, జోడు ప్రదీప్, వెంకటేశ్, భిక్షపతి, రవి, కిరణ్, సారయ్య, వెంకన్న, రమేశ్ పాల్గొన్నారు.

కళాకారులకు ఇంటి స్థలాలు అందించాలి

కృష్ణకాలనీ, మార్చి 24 : రాష్ట్రంలోని అన్ని జిల్లా కేంద్రాల్లో కళాకారులకు 200 గజాల ఇంటి స్థలాన్ని కేటాయించాలని తెలంగాణ కళావేదిక జయశంకర్ భూపాలపల్లి జిల్లా అధ్యక్షుడు కొండ్ర కుమార్ ఆదివారం ప్రభుత్వాన్ని ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్ర సాధనలో కళాకారుల పాత్ర ఎంతో ఉందన్నారు. 50 ఏళ్ల దాటిన వారికి నెలకు రూ. 10 వేలు పెన్షన్ ఇవ్వాలన్నారు. అలాగే కళాకారుడు చనిపోతే ఆయన కుటుంబానికి రూ. 10 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలన్నారు. తాము అధికారంలోకి వస్తే కళాకారులను ఆదుకుంటామన్న హామీని కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేర్చాలని కుమార్ డిమాండ్ చేశారు.

బీసీ ఓవర్సీస్ పథకానికి దరఖాస్తుల ఆహ్వానం

భూపాలపల్లి రూరల్, మార్చి 24 : మహాత్మా జ్యోతిబాపూలే విదేశీ విద్యానిధి (బీసీ ఓవర్సీస్) పథకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా బీసీ అభివృద్ధి అధికారి శైలజ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని ఈబీసీ, బీసీ విద్యార్థులు అర్హులని, ఏప్రిల్ 5లోగా ఆన్‌లైన్ వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. డిగ్రీలో 60 శాతం మార్కులు, వార్షిక ఆదాయం రూ. 5 లక్షల లోపు ఉండాలని, జీఆర్ఈ, జీమ్యాట్ స్కోర్‌ను పరిగణలోనికి తీసుకుంటారని పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి

కాటారం, మార్చి 24 : మండలంలోని గుండ్రాత్‌పల్లి-గంగపురి మధ్యలో ఆదివారం రాత్రి రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్న ఘటనలో ఒకరు మృతి చెందారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. దామెర కుంటకు చెందిన మాజీ సర్పంచ్ కనుకుంట్ల సమ్మయ్య గుండ్రాత్‌పల్లి నుంచి ద్విచక్ర వాహనంపై స్వగ్రామానికి వెళ్తున్నారు. గుండ్రాత్‌పల్లికి చెందిన గజ్జెల సమ్మయ్య, రజిత దంపతులు వారి చిన్నారిని తీసుకొని దామెరకుంట మీదుగా వెళ్తున్నారు. ఈ క్రమంలో వీరి ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ సమయంలోనే గుండ్రాత్‌పల్లి వెళ్తున్న పున్నం సురేశ్ వాహనాలను గమనించక ఢీకొట్టాడు. దీంతో సురేశ్, కనుకుంట్ల సమ్మయ్య తలకు తీవ్రగాయాలయ్యాయి. గజ్జెల సమ్మయ్య, రజితకు స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులు కనుకుంట్ల సమ్మయ్య, పున్నం సురేశ్‌ను ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ సమ్మయ్య మృతి చెందాడు. సురేశ్ పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది. అలాగే ధన్వాడ గ్రామంలో నడుచుకుంటూ వెళ్తున్న చీటూరి నీరజ, కొండ్ర లక్ష్మిని లచ్చిరెడ్డి అనే వ్యక్తి బైక్‌తో ఢీకొట్టడంతో వారికి గాయాలయ్యాయి.

భూపాలపల్లి కలెక్టర్ భవేశ్ మిశ్రా

హోలీని సంతోషంగా జరుపుకోవాలి

ప్రజలకు శుభాకాంక్షలు తెలిపిన కలెక్టర్ భవేశ్ మిశ్రా

భూపాలపల్లి రూరల్, మార్చి 24 : జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని ప్రజలకు కలెక్టర్ భవేశ్ మిశ్రా హోలీ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. వసంత రుతువును స్వాగతిస్తూ జరుపుకునే హోలీ ప్రతి ఇంటా ఆనందాన్ని నింపాలని ఆయన ఒక ప్రకటనలో ఆకాంక్షించారు. ప్రజలందరూ సంతోషంగా పండుగను జరుపుకోవాలన్నారు. రసాయనాలతో కూడిన రంగులను వినియోగించొద్దని, సహజ సిద్ధమైన రంగులను వాడాలన్నారు. పిల్లలు, యువకులు స్నానాల కోసం చెరువులు, బావులు, కాల్వల వద్దకు వెళ్లకుండా తల్లిదండ్రులు చూడాలని కలెక్టర్ కోరారు.

సహజ రంగులనే వినియోగించాలి

గణపురం/టేకుమట్ల/వెంకటాపూర్, మార్చి 24 : హోలీ వేడుకలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని గణపురం, టేకుమట్ల, వెంకటాపూర్ ఎస్సైలు మచ్చ సాంబమూర్తి, ప్రసాద్, చల్ల రాజు ఆయా మండలాల ప్రజలకు సూచించారు. ఎలాంటి గొడవలకు తావివ్వకుండా, ఆనందోత్సాహాల నడుమ, సహజసిద్ధమైన రంగులతో పండుగను జరుపుకోవాలన్నారు. చెరువులు, బావుల వద్దకు స్నానాలకు వెళ్లొద్దని, మద్యం తాగి వాహనాలు నడపొద్దని ఎస్సైలు కోరారు.

దేవునిగుట్టపై పూజలు చేస్తున్న భక్తులు

కనుల పండువగా లక్ష్మీనర్సింహస్వామి కల్యాణం

భారీగా తరలివచ్చిన భక్తులు

ములుగు రూరల్, మార్చి 24 : ములుగు మండలంలోని కొత్తూరు దేవునిగుట్టపై ఉన్న పురాతన ఆలయం వద్ద ఆదివారం శ్రీ లక్ష్మీనర్సింహస్వామి జాతర ప్రారంభమైంది. మొదటి రోజు లక్ష్మీనర్సింహస్వామి కల్యాణ మహోత్సవాన్ని కనుల పండువగా జరిగింది. పూడిచేటి శేషాచార్యులు, హరికృష్ణమాచార్యులు కల్యాణ క్రతువును నిర్వహించారు. కొత్తూరు గ్రామ ప్రజలు ఇంటింటికీ బొట్టు కార్యక్రమాన్ని నిర్వహించారు.

పంచోత్కులపల్లి, రాయినిగూడెం, సర్వాపురం, దుబ్బగూడెం, పెగడపల్లి, ములుగు గ్రామాల ప్రజలు అధిక సంఖ్యలో కాలినడకన గుట్ట మార్గం గుండా గుడివద్దకు చేరుకొని ఈ వేడుకను వీక్షించారు. కొబ్బరికాయలు కొట్టి స్వామికి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో సౌకర్యాలు కల్పించారు.

కాళేశ్వరం ఆలయానికి ఎన్టీపీసీ వితరణ

కాళేశ్వరం ఆలయంకు అందజేస్తున్న ఎన్టీపీసీ అధికారులు

కాళేశ్వరం, మార్చి 24 : కాళేశ్వరం ముక్తీశ్వర స్వామి ఆలయానికి రామగుండం ఎన్టీపీసీ డైరెక్టర్ కేదార్ రంజన్‌పాండు రూ. 4 లక్షల విలువైన వస్తువులను ఆదివారం అందజేశారు. ముందుగా ఆలయానికి చేరుకున్న ఆయన స్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ సూపరింటెండెంట్ శ్రీనివాస్‌కు సీఎస్ఆర్ నిధుల నుంచి కొనుగోలు చేసిన 50 ఫ్లడ్ లైట్లు, 50 ఫ్యాన్లు, 50 డస్ట్ బిన్లతో పాటు ఇతర వస్తువులను అందజేశారు. ఎన్టీపీసీ అధికారులతో పాటు ఆలయ మాజీ ధర్మకర్త ఆరెల్లి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

నేడు మందరగిరిలో డోలోత్సవం

మహదేవపూర్, మార్చి 24 : మండల కేంద్రంలోని మందరగిరి శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయంలో సోమవారం డోలోత్సవ వేడుకలు నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకుడు తిరునగరి నవీన్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సాయంత్రం నాలుగు గంటలకు ఊయల కట్టి స్వామికి జోల పాటల కార్యక్రమం చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని ఆయన కోరారు.

క్షయ వ్యాధిపై అవగాహన

వ్యాధి లక్షణాలను వివరిస్తున్న డాక్టర్ రామారావు

మహదేవపూర్, మార్చి 24 : మండలంలోని అంబట్‌పల్లి పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ఆదివారం సూరారం గ్రామంలో క్షయవ్యాధిపై ప్రజలకు అవగాహన కల్పించారు. క్షయ వ్యాధి లక్షణాలు, నివారణ చర్యలను డాక్టర్ రామారావు ప్రజలకు వివరించారు. వారం రోజులకు మించి దగ్గు, శరీర బరువు తగ్గడం, రాత్రి వేళల్లో జ్వరం రావడం వంటి లక్షణాలుంటే వెంటనే వైద్యున్ని సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ మాషూక్ అలీ, ఏఎన్ఎంలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

బీసీలు ఐక్యంగా పోరాడాలి

భూపాలపల్లి రూరల్, మార్చి 24 : బీసీలు రాజ్యాధికారం కోసం ఐక్యంగా పోరాడాల్సిన అవసరం ఉందని హైకోర్టు న్యాయవాది, ఆధార్‌పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఈద శేషగిరిరావు గౌడ్ అన్నారు. భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని సింధూరి హోటల్‌లో ఆధార్ పార్టీ భూపాలపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి తాళ్లపెల్లి రమేశ్‌గౌడ్ ఆధ్వర్యంలో ఆదివారం జిల్లాలోని గౌడ, బీసీ కులస్తులతో గెట్ టుగెదర్ నిర్వహించారు. కార్యక్రమంలో గట్టు యుగేంధర్, బత్తిని శివశంకర్, బుర్ర కుమార్, పొన్నం భిక్షపతి, మంద వెంకన్న, సాగర్, కొత్తకొండ రాణి, పరకాల సమ్మయ్య, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా ఇసుకను తరలిస్తే పీడీ యాక్ట్

కాటారం, మార్చి 24 : ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని కాటారం డీఎస్పీ రామ్మోహన్ రెడ్డి హెచ్చరించారు. ఈ మేరకు కాటారం సబ్ డివిజన్ పరిధిలోని లారీలు, ట్రాక్టర్లు, జేసీబీ డ్రైవర్లు, యజమానులకు ఆదివారం కౌన్సెలింగ్ నిర్వహించారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఇసుకను తరలిస్తే సంబంధిత వాహనాలను సీజ్ చేసి కోర్టులో డిపాజిట్ చేయనున్నట్లు తెలిపారు. ఇసుకను డంప్ చేసిన భూమికి సంబంధించిన యజమానిపై కూడా కేసు నమోదు చేస్తామన్నారు. అవసరమైతే పీడీ యాక్టుకు కూడా వెనుకాడబోమని హెచ్చరించారు. కాటారం, మహదేవపూర్ సీఐలు నాగార్జునరావు, రాజేశ్వరరావు, ఎస్సైలు అభినవ్, ప్రసాద్, నరేశ్ పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ

తనిఖీ చేస్తున్న పస్రా ఎస్సై

గోవిందరావుపేట, మార్చి 24 : మండలంలోని పస్రా-మేడారం వెళ్లే దారిలో ఎస్సై కమలాకర్ సిబ్బందితో కలిసి ఆదివారం వాహనాల తనిఖీ చేపట్టారు. ఇటీవల మహారాష్ట్రలోని గడ్చిరోలి ప్రాంతంలో జరిగిన ఎన్‌కౌంటర్‌కు నిరసనగా మావోయిస్టులు బంద్‌కు పిలుపునిచ్చిన నేపథ్యంలో పోలీసులు అప్రమత్తమయ్యారు. ఎస్సై ఆధ్వర్యంలో విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. అర్ధరాత్రి సైతం తనిఖీలను చేపడుతున్నారు. వచ్చి పోయే వాహనాలను ఆపి వ్యక్తుల వివరాలను అడిగి తెలుసుకోవడంతో పాటు అనుమానితుల పూర్తి సమాచారం తెలుసుకుంటున్నారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ మావోయిస్టులకు సహకరిస్తే కఠిన చర్యలుంటాయని హెచ్చరించారు.

మహదేవపూర్‌లో..

మహదేవపూర్ : మండల కేంద్రంలోని అంబట్‌పల్లి గ్రామంలోని మేడిగడ్డ బరాజ్ సమీపంలో, రాపల్లికోట క్రాస్ రోడ్డు వద్ద ఎస్సై ప్రసాద్ ఆధ్వర్యంలో పోలీసులు ఆదివారం వాహనాల తనిఖీలు చేపట్టారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో వచ్చి పోయే వాహనాలను క్షుణ్ణంగా పరిశీలించారు. సరైన పత్రాలు లేని వారికి జరిమానా విధించారు. రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని సూచించారు.

అక్రమ కలప పట్టివేత

పలిమెల, మార్చి 24 : మండలంలోని సర్వాయిపేట గోదావరి నది పరీవాహక ప్రాంతంలో టేకు కలపను పట్టుకున్నట్లు రేంజ్ అధికారి వెంకటేశ్వర్‌రావు తెలిపారు. ఆదివారం ఉదయం సిబ్బందితో కలిసి సర్వాయిపేట బీట్ పరిధిలో పెట్రోలింగ్ నిర్వహిస్తున్న క్రమంలో 18 టేకు దుంగలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వాటి విలువ సూమారు రూ. 40 వేలు ఉంటుందని, కలపను మహదేవపూర్ టింబర్ డిపోకు తరలించినట్లు వెంకటేశ్వర్‌రావు పేర్కొన్నారు. కార్యక్రమంలో సెక్షన్ ఆఫీసర్లు కృష్ణ, రాజేందర్, బీట్ ఆఫీసర్లు నాగరాజు, సదానందం, బేస్ క్యాంపు సిబ్బంది పాల్గొన్నారు.

నాంచారమ్మ జాతరను విజయవంతం చేయాలి

వెంకటాపూర్, మార్చి 24: మండలంలోని రామంజాపూర్ గ్రామ శివారులోని నాంచారమ్మ ఆలయంలో మే 23 నుంచి నిర్వహించే జాతరకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని ఆలయ కమిటీ చైర్మన్ లోకిని రాజు పిలుపునిచ్చారు. ఆదివారం ఆయన ఎరుకల సంఘం జిల్లా అధ్యక్షుడు కేతిరి భిక్షపతి, ప్రధాన కార్యదర్శి పల్లకొండ భాస్కర్‌తో కలిసి జాతర ఏర్పాట్లను పర్యవేక్షించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కాకతీయ రాజులు నిర్మించిన నాంచారమ్మ ఆలయంలో జరిగే జాతరకు నాలుగు రాష్ట్రాల భక్తులతో పాటు తెలంగాణకు చెందిన ఎరుకల కులస్తులు వస్తారని తెలిపారు. జాతరకు ప్రభుత్వం నిధులు కేటాయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు పాలకుర్తి సురేశ్, దేవర్ల సతీశ్, గణేశ్, గంగయ్య, అశోక్, ప్రమీల, సరోజన, సారయ్య, బంగారయ్య, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

తగ్గుతున్న గోదావరి నీటిమట్టం

నీరులేక వెలవెలబోతున్న సమ్మక్క బరాజ్

కన్నాయిగూడెం, మార్చి 24 : మండలంలోని తుపాకులగూడెం సమ్మక్క బరాజ్ వద్ద గోదావరి నీటిమట్టం రోజురోజుకు తగ్గిపోతున్నది. ఆదివారం ఎగువ నుంచి 900 క్యూసెక్కుల వరద నీరు వస్తున్నట్లు నీటిపారుదల శాఖ అధికారులు తెలిపారు. బరాజ్ వద్ద ప్రస్తుత నీటిమట్టం 74.1 మీటర్లకు పడిపోయింది. గత ఏడాది వేసవికి ముందు నుంచే 80 మీటర్ల నీటి మట్టం ఉండేలా అధికారులు బరాజ్ గేట్లను ఆపరేట్ చేశారు. ఈ ఏడాది అటువంటి చర్యలు చేపట్టలేదు. దేవాదులలోని ఐదు మోటర్ల ద్వారా రోజుకు 1414 క్యూపెక్కుల నీటిని భీంఘనపురం రిజర్వాయర్‌లోకి ఎత్తిపోస్తున్నారు. దీంతో ఎగువ నుంచి వచ్చే నీటి కంటే మోటర్ల ద్వారా 514 క్యూసెక్కుల నీరు అధికంగా పంపింగ్ జరుగుతున్నది. ఉన్నతాధికారుల ఆదేశానుసారం మోటర్లను ఆన్ చేస్తున్నట్లు డీఈ శరత్, ఏఈఈ సాయిరాం తెలిపారు.

భవనాన్ని పరిశీలిస్తున్న డీఎఫ్‌వో

భవన నిర్మాణ పనుల పరిశీలన

ఏటూరునాగారం, మార్చి 23 : మండలంలో అటవీశాఖ ఆధ్వర్యంలో నిర్మిస్తున్న భవనాల తుది దశ పనులను డీఎఫ్‌వో కిషన్‌జాదవ్ ఆదివారం సందర్శించి పరిశీలించారు. చిన్నబోయినపల్లిలో డీఆర్‌వో, ఏటూరునాగారంలో బీట్ ఆఫీసర్ క్వార్టర్ల నిర్మాణ పనులను సుమారు రూ. 50 లక్షలతో చేపట్టారు. ఈ క్రమంలో వాటి పురోగతిని డీఎఫ్‌వో పరిశీలించారు. పనులను త్వరగా పూర్తి చేయాలని డీఎఫ్‌వో ఆదేశించారు. ఆయన వెంట రేంజ్ ఆఫీసర్ నరేందర్, బీట్ ఆఫీసర్ దయానంద్ ఉన్నారు.

తస్లీమా బినామీలపై విచారణ చేపట్టాలి

ములుగు రూరల్, మార్చి 24 : ములుగులో 12 ఏళ్లపాటు విధులు నిర్వర్తించిన సబ్ రిజిస్ట్రార్ తస్లీమా మహ్మద్‌కు బినామీగా ఉన్న వ్యక్తులపై విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని ఎన్‌హెచ్ఆర్సీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ మొగుళ్ల భద్రయ్య ఆదివారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఏసీబీ అధికారులకు పట్టుబడిన తస్లీమాకు బినామీలైన ఆమె భర్త అబ్దుల్‌గఫార్, సర్వర్ ఫౌండేషన్ భాగస్వామిగా ఉన్న ఎన్ఆర్ఐ రాపల్లి సత్యం, ఆమె పీఆర్వో మామిడిపెల్లి రమేశ్ అకౌంట్లను సీజ్ చేసి వారి ఆస్తులను లెక్క కట్టాలన్నారు. దళిత నాయకుడు బొచ్చు సమ్మయ్యను ప్రధాన అనుచరుడిగా నియమించుకొని అతడితో దాడులు చేయించేదని, అతడిపై కూడా చట్టపరంగా విచారణ జరిపించాలని భద్రయ్య అన్నారు. డాక్యుమెంట్ రైటర్ భానుప్రకాష్‌తో పాటు తస్లీమా నియమించుకున్న కంప్యూటర్ ఆపరేటర్ ఆడెపు భిక్షపతితో అనేక అక్రమాలకు పాల్పడిందని ఆరోపించారు. వీరందరిపై ప్రభుత్వం చట్టపరమైన విచారణ జరిపితే మరెన్నో అక్రమాలు వెలుగులోకి వస్తాయని భద్రయ్య పేర్కొన్నారు.

అనారోగ్యంతో సీనియర్ జర్నలిస్ట్ మృతి

అంతిమయాత్రలో పాల్గొన్న ప్రజాప్రతినిధులు, పాత్రికేయులు

నివాళులర్పిస్తున్న ప్రజాప్రతినిధులు

తంగెళ్లపల్లి రాజు (ఫైల్)

చిట్యాల, మార్చి 24 : మొగుళ్లపల్లి మండల కేంద్రానికి చెందిన సీనియర్ జర్నలిస్ట్ తంగెళ్లపల్లి రాజు (49) అనారోగ్యంతో చికిత్స పొందుతూ ఆదివారం తెల్లవారుజామున మృతి చెందాడు. రాజు కొంతకాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతూ హైదరాబాద్, హనుమకొండ దవాఖానల్లో చికిత్స చేయించుకున్నాడు. ఈ క్రమంలో హనుమకొండలోని ఓ ప్రైవేట్ దవాఖానలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. రాజు 'నమస్తే తెలంగాణ' దినపత్రికలో పదేళ్లుగా విధులు నిర్వర్తిస్తున్నాడు. రాజు కు భార్య మహిత, కుమారుడు, కూతురు ఉన్నారు. రాజు మృతదేహానికి రైతు విమోచన కమిషన్ మాజీ చైర్మన్ నాగుర్ల వెంకటేశ్వర్లు పూలమాల వేసి నివాళులర్పించారు. రాజు అంతిమయాత్రలో హైదరాబాద్ సివిల్ కోర్టు జడ్జి చిలుకమూరి పంచాక్షరి, చంద్రమౌళి, పున్